

సాధనే లక్ష్యానికి విజయమార్గం

ఎపి నిట్ అసోసియేట్ డీన్ సందీప్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నిరంతర సాధనే లక్ష్యానికి విజయ మార్గమని ఎపి నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్ సూచించారు. నిట్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ ఎన్‌వి.రమణారావు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరులోని ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాల విద్యార్థులు 180 మంది గురువారం నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వర్క్‌షాపులను పరిశీలించారు. యంత్రాల పనితీరు, వాటి ప్రాధాన్యతను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డాక్టర్ సందీప్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐ కళాశాల ప్రిన్సిపల్ పివి.సురేష్, ఎఐ మోహన్‌రావు, అధ్యాపకురాలు సుజాత, కోఆర్డినేటర్ కావేరి తదితరులు పాల్గొన్నారు.



పోలీసులంటే పట్టదా..!

- ఎన్నికల్లో పోలీస్ సిబ్బందికి ఇచ్చిన హామీలు బుట్టదాఖలు
- సరెండర్ లీవ్స్, టిఎ, డిఎ, వీక్లీఆఫ్ ఏ ఒక్కటీ అమలు కాని పరిస్థితి
- అప్పుడు వైసిపి, ఇప్పుడు కూటమి హయాంలో పోలీసులకు వంచన
- సిఎం క్యాంప్ ఆఫీసు టర్న్ విధులతో నరక యాతన
- రెండు జిల్లాల్లో దాదాపు 3,500 మందికిపైగా సిబ్బంది అవస్థలు

'పోలీసులంటే పాలకులకు పట్టదు.. పోలీసులను అన్ని విధాలుగా వాడుకోవడమే తప్ప తమ కష్టాలను మాత్రం పట్టించుకోరు' అంటూ ఆ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులంతా తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అప్పుడు వైసిపి ప్రభుత్వం.. ఇప్పుడు కూటమి సర్కార్ ఏ ప్రభుత్వం వచ్చినా ఇదే పరిస్థితి అని వాపోతున్నారు. తాను పోలీస్ అధికారి కొడుకునని, పోలీసుల కష్టాలు తీరుస్తానని చెప్పిన పవన్‌కల్యాణ్ సైతం అధికారంలోకొచ్చాక ఆ మాటలను మరిచిపోవడం అందరినీ తీవ్రంగా కలిచివేస్తోంది. కూటమి నేతలు ఎన్నికల్లో పోలీస్ సిబ్బందికి ఇచ్చిన హామీలు మరిచిపోవడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. దీంతో జిల్లాలోని వేలాది మంది పోలీస్ సిబ్బంది తమగోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు పోలీస్ సిబ్బందికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆ శాఖలో పని చేస్తున్న వారంతా కోరుతున్నారు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎండనక, వాననక.. రాత్రనక, పగలనక సమయంతో సంబంధం లేకుండా పని చేసే పోలీస్ సిబ్బంది కష్టాలను ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. గత వైసిపి ప్రభుత్వం పోలీసులను ప్రయివేటు సైన్యంలా వాడుకున్నప్పటికీ నిబంధనల ప్రకారం వారికి ఇవ్వాల్సినవి కూడా సక్రమంగా ఇవ్వలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. తాము అధికారంలోకి వస్తే పోలీసు సమస్యలు పరిష్కరిస్తామంటూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ గడిచిన ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. దీంతో తమకు మంచిరోజులు వచ్చాయంటూ పోలీస్ సిబ్బంది కూటమికి ఎన్నికల్లో జైకొట్టారు. అఖండ మెజార్టీతో గెలుపొందిన టిడిపి కూటమి అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకూ పోలీసులకు ఇచ్చిన ఏఒక్క హామీనీ అమలు చేయని పరిస్థితి నెలకొంది. కనీసం ఎప్పుడు అమలు చేస్తారో కూడా చెప్పడం లేదు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోలీసులకు ఇచ్చిన హామీలను కొన్నయినా అమలు పరుస్తారని పోలీస్ సిబ్బంది భావించినప్పటికీ నిరాశే మిగిలింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కానిస్టేబుల్ నుంచి ఎఎస్ఐ స్థాయి ఉద్యోగులు దాదాపు 3,500 మంది వరకూ ఉన్నారు. సిఐ, ఎస్ఐలు మరో 200 మంది వరకూ ఉండొచ్చు. పోలీస్ ఉద్యోగులకు సరెండర్ లీవ్స్ పేరుతో ఏడాదికి 45 రోజులు వేతనం ప్రభుత్వం ఇస్తోంది. ఈ వేతనం మూడువాయిదాల్లో జనవరి, జులై, నవంబర్ నెలల్లో జమ చేయాల్సి ఉంది. తక్కువ అనుభవం ఉన్న కానిస్టేబుల్‌కు రూ.70 వేలు, సీనియర్లకు రూ.లక్షన్నర వరకూ సరెండర్ లీవ్స్ బకాయిలు రావాల్సి ఉంది. మూడు విడతల సరెండర్ లీవ్స్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో ఈ సొమ్ముతోనే పోలీసులు తమ పిల్లలకు స్కూల్ ఫీజులు వంటివి కట్టుకునేవారు. అదేవిధంగా క్రిస్మస్, సంక్రాంతి పండుగలు జరుపుకునేవారు. గత వైసిపి ప్రభుత్వం సైతం సరెండర్ లీవుల సొమ్ము సక్రమంగా ఇవ్వకుండా తీవ్ర ఇబ్బంది పెట్టింది. పోలీసులకు ప్రతినెలా టిఎ (ట్రావెలింగ్ అలవెన్స్) ఇస్తారు. ఇది ఉద్యోగి కేడర్‌ను బట్టి రూ.2,250 నుంచి రూ.4,500 వరకూ ఉంది. గడిచిన 15 నెలలుగా టిఎ బకాయిలు చెల్లించలేదు. ఒక్కో ఉద్యోగికి సుమారుగా లెక్కించినా రూ.33 వేలకుపైగా సొమ్ము రావాల్సి ఉంది. దీనిలో సగం సొమ్ము ముందుగా ఇచ్చినా పోలీస్ సిబ్బందికి ఎంతోకొంత ఊరట కలిగేది. అది లేకుండాపోయింది. గత ప్రభుత్వం పోలీస్ సిబ్బందికి వారాంతపు సెలవు పేరుతో తెగ హడావుడి చేసింది. నెల, రెండు నెలలు అమలు చేసి చేతులెత్తేసింది. తాము అధికారంలోకి వస్తే పోలీస్ సిబ్బందికి వారాంతపు సెలవు (వీక్లీఆఫ్) అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇది అమలుకాని పరిస్థితి నెలకొంది.

టర్న్ డ్యూటీలతో నరకం..

ప్రతి జిల్లా నుంచి పోలీస్ సిబ్బందిని సిఎం క్యాంప్ ఆఫీస్ వద్ద టర్న్ డ్యూటీలు వేస్తున్నారు. సర్కిల్ పరిధిలో పది నుంచి 12 మంది వరకూ సిబ్బంది టర్న్ డ్యూటీలకు వెళ్తుంటారు. ఈ డ్యూటీ 15 రోజులు చేయాల్సి ఉంటుంది. టర్న్ డ్యూటీకి వెళ్తున్న పోలీసులకు అక్కడ ఎటువంటి వసతులూ ఉండడం లేదు. తినడానికి తిండిగానీ, ఉండడానికి చోటుగానీ ఏ ఒక్కటి ఉండని పరిస్థితి. డార్మెటరీలో ఉండాలన్నా రోజుకు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. భోజనం, ఇతర ఖర్చుల కింద రూ.300 వరకూ అవుతోంది. రోజుకు కనీసంగా రూ.500 వరకూ ఖర్చవుతోంది. ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుంది. టర్న్ డ్యూటీలు రద్దు చేయాలని పోలీస్ సిబ్బంది ఎప్పటి నుంచో కోరుతున్నారు. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వంలోనైనా తమ సమస్య తీరుతుందని పోలీసులు భావించినా విముక్తి లేకుండాపోయింది. సిఎం క్యాంప్ ఆఫీసు టర్న్ డ్యూటీలను వెంటనే ఆపేయాలని సిబ్బంది కోరుతున్నారు. పోలీసులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోగా, నిబద్ధతతో పనిచేయాలని మాత్రం పాలకులు ప్రసంగాలు ఇస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అంబేద్కర్‌పై వ్యాఖ్యలు అనుచితం

- అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి
- కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం
- దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - భీమవరం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షాను తక్షణం బర్తరఫ్ చేయాలని, పార్లమెంటు సాక్షిగా ప్రధాని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం డిమాండ్ చేశారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద కెవిపిఎస్, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పలు సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమైనవన్నారు. పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ని అవమానించడం అంటే పార్లమెంటుని, రాజ్యాంగాన్ని, దేశభక్తులను, మహనీయులను అవమానించడమేనని అన్నారు. ఈ ఘటనను దేశ ప్రజలందరూ ఖండించాలని కోరారు. సమాజంలో అంటరానితనం, కుల వివక్ష పోవాలని, సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసిన గొప్ప ఉత్తమ దేశ భక్తుడు, మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. అమిత్ షాను తక్షణం పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలు దేశంలోని అణగారిన ప్రజల మనస్సులను బాధించిందన్నారు. బిజెపి, వారి మంత్రులు, ఎంపీలు, ఎంఎల్ఎలు నిరంతరం రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలు అనాలోచితంగా చేసినవి కాదని, బిజెపి నిరంతరం రాజ్యాంగానికి, దళిత ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ అంబేద్కర్‌పై బిజెపికి ఉన్న ద్వేషాన్ని, కక్షను పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా బయట పెట్టాడని తెలిపారు. రానున్న రోజుల్లో బిజెపి ప్రమాదం మరింత పెరగబోతుందని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని, అందుకు ప్రజలందరూ ఐక్యంగా బిజెపి విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి దూసి కళ్యాణి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, మాల మహానాడు యువనేత మీసాల జయరాజు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎద్దు ఏసుపాదం, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బి.గణేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ వలీ, నాయకులు పట్టెం సుభాకర్, కె.రత్నకుమారి, కడిమి పుష్పన్న, వేండ్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

కాళ్ల: కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడటాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు తీవ్రంగా ఖండించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ అమిత్‌షాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని, పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నేతలు సోడదాసి గంగయ్య, సోము నాగ కేశవబాబు, కొండా రాజేష్‌కుమార్, కె.సత్యశ్రీనివాస్, తాళ్లూరి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆచంట: కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను పార్లమెంటులో ఎగతాళి చేసి మాట్లాడటం అత్యంత దుర్మార్గమని మాల మహానాడు సీనియర్ నేతలు బీరా మధు, సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక పెదపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో దబ్బా ప్రకాష్, తప్పెట్ల వెంకట్రావు, పిల్లి రుద్రప్రసాద్, మట్టా చంటి, కారేం సింగ్, కాకర దుర్గారావు, పీతల పండు, బొంతు శ్రీను, కుంచె రాజ్ కుమార్, వాసంగి కిరణ్, మండే శ్రీను, జల్లి అంద్రియ్య, కుంచె అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఉండి: అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో పాందువ్వలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాదాసు గోపి మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు ఎం.ప్రశాంత్, ఎం.మణింద్ర, డి.దుర్గాప్రసాద్, మోహన్, సుబ్రహ్మణ్యం, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు: అమిత్ షా తక్షణం తన పదవికి రాజీనామా చేసి క్షమాపణలు చెప్పాలని ఎఐఎస్ఎ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వెంకటేశ్వర సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యు.మురళీ, జి.దుర్గాప్రసాద్, డి.గుణశేఖర్, ఎస్.రాహుల్, జి.రమేష్ పాల్గొన్నారు.

నరసాపురం : పార్లమెంట్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యల్ని ఖండిస్తూ గురువారం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు. వెంటనే అమిత్‌షాను సస్పెండ్ చేసి తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్ రాజు డిమాండ్ చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.బాబ్జీ, కానూరి బుజ్జి, శ్రీధర్, కాకిలేట్ ఆనంద్, వనమయ్య పాల్గొన్నారు.



భీమవరంలో నిరసన తెలుపుతున్న దళిత ప్రజా సంఘాల నేతలు



కాళ్లలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

కలెక్టర్ టీచర్‌గా మారిన వేళ..!

పాందువ్వలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పాందువ్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో ఎంతమంది చదువుకుంటున్నారు, హైస్కూల్ చదువుకు ఎక్కడికి వెళ్తున్నారు, ఒక కుటుంబంలోని పిల్లలు ఇక్కడే చదువుకుంటున్నారా, వేర్వేరుగా చదువుకుంటున్నారా తదితర సమాచారాన్ని ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ప్రాథమిక విద్య పటిష్టంగా ఉంటే తర్వాత తరగతులు సులభంగా చదవగలుగుతారని, ఉపాధ్యాయులు మరింత శ్రద్ధతో పిల్లలకు విద్యతోపాటు మంచి అలవాట్లను నేర్పాలని సూచించారు. చిన్నతనంలో వారికి నేర్పిన విద్య, అలవాట్లు జీవితకాలం గుర్తుంటాయని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులతోపాటు బెంచ్ మీద కూర్చుని వారితో పాఠాలు చదివిస్తూ, తప్పులు సరి చేస్తూ విద్యార్థులతో మమేకమయ్యారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులను పేర్లు అడిగి తెలుసుకుని వారితో పాటలు పాడించారు. చిన్నారులు కూడా బెదురు లేకుండా ఉత్సాహంగా పాటలు పాడటంపై కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం ఆహారాన్ని తప్పకుండా అందించాలని అంగన్వాడీలకు సూచించారు. అంగన్వాడీ భవనం సరిగ్గా లేనందున మరో ప్రదేశంలోకి మార్చాలని తెలిపారు. అనంతరం నిర్మాణం పూర్తయిన సచివాలయాన్ని పరిశీలించారు. స్విచ్‌బోర్డుల ఏర్పాటు తదితర చిన్న చిన్న పెండింగ్ పనులను పూర్తి చేసి వెంటనే ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు.



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న కలెక్టర్ నాగరాణి

మార్గమధ్యంలో కాలనీల పరిశీలన..

స్థానిక జెడ్‌పి హైస్కూల్ పరిశీలనకు బయలుదేరిన సమయంలో మార్గమధ్యంలో కొందరు మహిళలు జిల్లా కలెక్టర్ వాహనాన్ని ఆపి మా కాలనీలో డ్రెయినేజీ లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దాదాపు 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వం మాకు ఇళ్లు కేటాయించిందని, నాటి నుంచి డ్రెయినేజీ లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులకు, స్పందనలో అధికారులకు తెలియజేసినా పరిష్కరించలేదని వాపోయారు. దీంతో కలెక్టర్ కారు దిగి కాలినడకన అక్కడ వాస్తవ పరిస్థితిని పరిశీలించారు. డ్రెయినేజీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఎంపిడిఒను ఆదేశించారు.

మధ్యాహ్న భోజనం రుచి చూసిన కలెక్టర్ నాగరాణి

ఉండి జెడ్‌పి హైస్కూల్‌ను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల మొత్తం కలియదిరిగి పాఠశాల ఎప్పుడు ఏర్పాటు చేశారు, ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు, రిజల్ట్ ఎలా ఉంది తదితర విషయాలను ప్రధానోపాధ్యాయిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలకు వడ్డించే మధ్యాహ్న భోజన పదార్థాలను ఆర్‌డిఒ, డిఇఒతో కలిసి కలెక్టర్ రుచి చూశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ వంద రోజుల యాక్షన్ ప్లాన్ తొమ్మిదో తరగతి విద్యార్థుల నుండే అమలు చేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1918లో నెలకొల్పిన ఈ పాఠశాల ఎంతో విశిష్టమైందని, ఇటీవల పాఠశాలను స్థానిక ఎంఎల్ఎ కనుమూరి రఘురామ కృష్ణంరాజు ప్రత్యేక చొరవతో మౌలిక వసతులను అభివృద్ధి చేశామన్నారు. విద్యార్థులకు మంచి విద్యను అందించి ప్రయోజకులయ్యేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, తహశీల్దార్ కె.నాగార్జున, ఎంపిడిఒ ఎస్.రవీంద్ర, ఎంపిటిసి సాగిరాజు సుజాత, ఎంఇఒ బి.వినాయకుడు, జ్యోతి, ప్రధానోపాధ్యాయులు పివి.సత్యనారాయణరాజు, వై.రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

విద్యుత్ భారాలు ఉపసంహరించండి



విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పెంపుతో జనం ఆందోళన చెందుతున్నారు.. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ఇప్పుడు పరోక్ష రూపంలో ఛార్జీలు మోపడం అన్యాయమని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో వినియోగించిన విద్యుత్‌కు మళ్లీ బిల్లులు చెల్లించాలనడం దారుణమని విమర్శిస్తున్నారు. తక్షణం భారాలను ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై పలువురి మనోగతం.. ప్రజాశక్తి - యంత్రాంగం

ఎస్‌సి, ఎస్‌టిలకు పెనుభారం.. ★★★

మిర్యాల దిలీప్, చింతలపూడి



వైసిపి ప్రభుత్వ హయాంలో జగన్మోహన్‌రెడ్డి ఐదుసార్లు కరెంట్ ఛార్జీలు పెంచారు. ప్రతిసారీ 50 పైసల్లోపే పెంచారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కరెంటు ఛార్జీ రూపాయిన్నర పెంచి వినియోగదారుల నడ్డి విరిచారు. ఈ ఛార్జీల పెంపు ఎస్‌సి, ఎస్‌టిలకు పెనుభారంగా మారనుంది.

విద్యుత్ భారాలు ఉపసంహరించాలి.. ★★★

ఎల్ఎస్.భాస్కర్‌రావు, సామాజిక కార్యకర్త, మండవల్లి



గతంలో వాడిన కరెంటుకు ఇప్పుడు ట్రూఅప్ ఛార్జీ పేరుతో ఇప్పుడు వసూళ్లు చేయడం ఎంతవరకూ సమంజసం. విద్యుత్ ఛార్జీల భారంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. సర్దుబాటు ఛార్జీలు నిలిపివేయాలి. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి. గత ప్రభుత్వం పెంచిన ఛార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి అది విస్మరించడమే కాక అదనపు భారాలు మోపడం బాధాకరం. తక్షణం ఆ భారాలను ఉపసంహరించాలి.

పేదలపై పెనుభారం.. ★★★

బిఎన్.సాగర్, అరసం రాష్ట్ర కార్యదర్శి, టి.నర్సాపురం



గతంలో వినియోగించిన విద్యుత్‌కు మళ్లీ బిల్లులు చెల్లించాలనడం దారుణం. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న తరుణంలో విద్యుత్ ఛార్జీల భారం పేదలు భరించలేనిది. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలి. వెంటనే విద్యుత్ భారాలను ఉపసంహరించాలి.

ఎన్నికల హామీలకు విరుద్ధంగా భారాలు.. ★★★

రామకుర్తి నాగేశ్వరరావు, భీమడోలు



కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాల అంశంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు విరుద్ధంగా వ్యవహరించడం దారుణం. గతంలో నా ఇంటికి రూ.వెయ్యి వరకు విద్యుత్ బిల్లు వచ్చేది. ప్రస్తుతం మరో సగం పెరిగింది. వాణిజ్యంతో పాటు, ప్రత్యేక కేటగిరీల కింద వసూలు చేసే బిల్లుల పెంపు విషయంలో కూడా స్పష్టత లేదు. జనవరి నుంచి బిల్లులు నూతన టారిఫ్ ప్రకారం వసూలు చేస్తాననడం సరికాదు. సోలార్ విద్యుత్ వాడకాన్ని ప్రోత్సహిస్తామని చెప్పిన ప్రభుత్వం దానికి అయ్యే ఖర్చు సామాన్యులకు అందుబాటులో లేకుండా చేసింది. ఏదేమైనా పెంచిన భారాలను ఉపసంహరించాలి.

సామాన్యులపై అదనపు భారం.. ★★★

బిఎన్.మల్లేశ్వరి, నారాయణపురం, ఉంగుటూరు మండలం



ప్రభుత్వాలు మారినా సామాన్య ప్రజానీకంపై భారాలు తగ్గడం లేదు. విద్యుత్ బిల్లుల్లో ట్రూఅప్, సర్దుబాటు అంటూ అదనంగా ఛార్జీలు వచ్చి చేరాయి. విద్యుత్ వినియోగించిన దానికి ఎలాగూ ఛార్జీ వసూలు చేస్తున్నప్పుడు మళ్లీ ఈ సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల భారం వేయడం అన్యాయం. అన్ని ఖర్చులూ పెరిగిపోతూ కుటుంబాన్ని సాకడం చాలా కష్టంగా ఉంటోంది. దీనికితోడు విద్యుత్ బిల్లుల భారం మరింత ఆర్థిక భారం కానుంది. ప్రభుత్వం పునారాలోచించి పేదలకు సర్దుబాటు ఛార్జీల మోత నుంచి ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

ఎన్నికల హామీ అమలు చేయాలి.. ★★★

మల్లాది రత్నాకర్, నూజివీడు



నేను టైలరింగ్ చేసుకుని జీవిస్తున్నాను. ట్రూఅప్ ఛార్జీల భారం ఎక్కువగా ఉంది. ఇప్పటికే రెడీమేడ్ దుస్తుల వల్ల టైలర్ల పరిస్థితి అధ్వానంగా మారింది. గత ఎన్నికల సందర్భంగా విద్యుత్ ఛార్జీల పెంచబోనని హామీ ఇచ్చిన కూటమి ఇప్పుడు పరోక్ష రూపంలో ఛార్జీలు మోపడం అన్యాయం. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఛార్జీల భారాన్ని ఉపసంహరించాలి.

స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి.. ★★★

బసవ కోటిలింగం, గాజుల వ్యాపారి, ఆగిరిపల్లి



నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి పేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతుంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ భారాలు మోపడం దారుణం. ట్రూఅప్ ఛార్టీలు, అదనపు ఛార్జీల పేరిట బాదుడు తగదు. విజిలెన్స్ దాడుల పేరుతో అధిక లోడుల కింద వేలాది రూపాయల విద్యుత్ బిల్లులను వినియోగదారులకు పంపడంతో వినియోగదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొత్తగా ఇప్పుడు వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్‌మీటర్లు (అదానీ) బిగించడం ఎంతవరకు సమంజసం. తక్షణం విద్యుత్ భారాలు ఉపసంహరించి స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి.

అపరిష్కృత కేసుల విచారణ వేగవంతం చేయాలి

ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అపరిష్కృతంగా ఉన్న కేసులపై దృష్టి కేంద్రీకరించి దర్యాప్తు వేగవంతం చేయాలని, జిల్లాలో గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టాలని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం నుండి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో పెండింగ్ ఫిర్యాదులు, ఎన్‌డిపిఎస్, మిస్సింగ్, ప్రాపర్టీ, గ్రేవ్, సైబర్, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర ముఖ్యమైన అంశాలకు సంబంధించిన కేసులపై ఎస్‌పి నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న తీవ్రమైన కేసుల్లో నిశితమైన సాక్ష్యాధారాలతో సమగ్ర దర్యాప్తుతో పురోగతి సాధించాలని, పెండింగ్ గ్రేవ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి ఛార్జిషీట్ కోర్టులో దాఖలు చేయాలని ఆదేశించారు. డిఎస్‌పి నుంచి ఎస్ఐల వరకూ అంతా తప్పనిసరిగా గ్రామ సందర్శనలు చేయాలని, ప్రజలతో మమేకమై గ్రామంలో సమస్యలను గుర్తించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించాలన్నారు. ప్రాథమిక స్థాయిలోనే ఆయా వ్యక్తులను ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. గంజాయి నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గంజాయి నిందితులపై నిరంతర నిఘా పెట్టాలన్నారు. సైబర్, సోషల్ మీడియా క్రైమ్స్, మహిళా సంబంధిత నేరాలు, మాదక ద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాలపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. దర్యాప్తులో ఉన్న హత్యాయత్నం, మిస్సింగ్, అనుమానాస్పద మరణాలు, ఆత్మహత్య కేసులను సమీక్షించి, ఆయా కేసుల దర్యాప్తు పూర్తి చేసేందుకు అధికారులకు ఎస్‌పి దిశానిర్దేశం చేశారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు అందిన వెంటనే తక్షణమే చట్టప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీ పటిష్టంగా నిర్వహించాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రద్దీ ప్రదేశాలు, మార్కెట్ ప్రాంతాలు, బ్యాంకులు, కళాశాలల వద్ద విజిబుల్ పోలీసింగు నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిలను కట్టడి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిఐ వి.పుల్లారావు, డిసిఆర్‌బి సిఐ డి.వెంకటేశ్వరరావు, సైబర్, సోషల్ మీడియా క్రైమ్స్ సిఐ జివివి.నాగేశ్వరరావు, మహిళా పోలీసు స్టేషన్ సిఐ అహ్మదున్నిషా తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ భవన నిర్మాణం పూర్తి చేయాలి : డిప్యూటీ స్పీకర్

ప్రజాశక్తి - ఉండి

నిర్మాణ దశలో నిలిచిపోయిన ఉండి ఇరిగేషన్ కార్యాలయాన్ని డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు గురువారం పరిశీలించారు. పనులపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉండి డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ తోట ఫణిబాబు మాట్లాడుతూ 2014-19 కాలంలో ఉండి డిసి ఛైర్మన్‌గా తాను పని చేస్తున్న కాలంలో పెంకుటిల్లులో ఉన్న ఇరిగేషన్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో సుమారు రూ.30 లక్షల వ్యయంతో నూతన భవన నిర్మాణానికి పూనుకున్నామన్నారు. 90 శాతం పనులు పూర్తి చేశామని, వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో పనులు నిలిచిపోయాయని వివరించారు. దీనిపై డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ త్వరితగతిన ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉండి డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు, టిడిపి మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు, ఉపాధ్యక్షులు పేరిచర్ల బాలరాజు, గ్రామాధ్యక్షులు కాగిత బుజ్జి, నాయకులు కరిమెరక శ్రీను, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, కల్లేపల్లి సతీష్‌రాజు, గొట్టుముక్కల భాస్కర్‌రాజు, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘు రామకృష్ణంరాజు

గుడ్డ సంచులనే వినియోగించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను వినియోగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం శ్రీవిజ్ఞాన వేదిక, పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కెజిఆర్ఎల్ జూనియర్ కళాశాలలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ, సదస్సు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపార దుకాణాల్లో తనిఖీలు చేపట్టి జరిమానాలు, హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. ఇకపై ప్లాస్టిక్ వాడకం కనిపిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగం విడనాడాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గుడ్డ సంచులనే వాడాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ విప్పర్తి వెంకటరత్నం, గుత్తుల హేమలత, తాడిప్రత్రి రమ్య, మాధవి పాల్గొన్నారు.

వార్డుల్లో పారిశుధ్య పనుల పరిశీలన

నరసాపురం: అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం తెల్లవారుజామున పట్టణంలో పలు వార్డులను ఆయన సందర్శించి ఆయా వార్డుల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

21న వాసవీ జిఎంఆర్ కాలేజీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో వాసవీ జిఎంఆర్ డిగ్రీ కాలేజీలో ఈ నెల 21న ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో అపోలో ఫార్మసీ లిమిటెడ్ హైదరాబాద్ ఫార్మాసిస్ట్, ముత్తూట్ మైక్రో ఫైనాన్స్ కంపెనీలో రిలేషన్ షిప్ ఆఫీసర్, సీనియర్ రిలేషన్ షిప్ ఆఫీసర్, భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూషియన్ లిమిటెడ్ బ్యాంకులో ఫీల్డ్ అసిస్టెంట్ వంటి విభాగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ కింది లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. అదనపు వివరాలకు నాగేంద్ర - 9502024765 నంబరును సంప్రదించాలని సూచించారు.

ఘనంగా నాగరాజు పుట్టినరోజు

ఉండి: పాలకోడేరు కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు కొత్తపల్లి నాగరాజు పుట్టినరోజు వేడుకలు ఉండి ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణంలో డిసి ఛైర్మన్ తోట ఫణి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోట ఫణి, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు మాట్లాడుతూ కొత్తపల్లి నాగరాజు ఏ పదవిలో ఉన్నా ఆ పదవికి వన్నె తెచ్చే విధంగా కృషి చేస్తారని తెలిపారు. పాలకోడేరు రూరల్ బ్యాంకును అభివృద్ధి చేయడంలో నాగరాజు పాత్ర ఉందని తెలిపారు. అనంతరం కొత్తపల్లి నాగరాజుతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

గణపవరం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అంశంపై జరిగిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల విఆర్ఒలు, అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: గ్రామాలు సుభిక్షంగా సుస్థిరాభివృద్ధి సాధించాలంటే సర్పంచులు కీలకపాత్ర పోషించాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎం.వెంకటేష్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల సమైక్య భవనంలో శిక్షణ కార్యక్రమంలో సర్పంచులకు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల వర్క్ షాప్‌ను గురువారం ప్రారంభించారు. అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వెంకటేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచుల పాత్రపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన రఘురామ్

తాడేపల్లిగూడెం: తాడేపల్లిలో వైసిపి కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని వైసిపి రాష్ట్ర రైతు విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్ నాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డికి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో రైతులు పడుతున్న సమస్యలు గురించి చర్చించారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించే విధంగా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని జగన్మోహన్ రెడ్డి సూచించారని తెలిపారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - తణుకు

విద్యార్థులు మంచి లక్ష్యాలను ఏర్పరచుకుని, ఉద్యోగ సృష్టి చేయగల స్థితికి ఎదగాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తనయుడు ఆరిమిల్లి నిఖిల్‌రత్న అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు), బాలికల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి ఎం.మురళీ సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పద్మావతి, పట్టణాధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, తాతపూడి మారుతీరావు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

తణుకు: నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆకాంక్షించారు. గురువారం స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాల్లో 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తొలుత ఎంఎల్ఎ ఫిజియోథెరఫీ సెంటర్‌లోని అడ్వాన్స్‌డ్ పెయిన్ మోడాలిటీస్ (ఐఎఫ్‌టి) మిషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఎంఎల్ఎను సత్కరించారు. కార్యక్రమంలో ప్రజావైద్యులు తాతిన రామబ్రహ్మం, సంఘం అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి, గౌరవ అధ్యక్షులు హుస్సేన్‌అహ్మద్ పాల్గొన్నారు.

అభివృద్ధి అన్ని జిల్లాల్లో జరగాలి : జోగయ్య

పాలకొల్లు : అభివృద్ధి అంటే రాజ సౌధాలుగా పరిపాలన భవనాలు, దివాన్ భవనాలు పార్కులు, కళాభవనం విశ్రాంతి భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వడమే కాదు, రోడ్ల నిర్మాణం, సాగునీరు మురుగు కాలువలు నిర్మాణం, స్వచ్ఛమైన తాగునీరు అందించడం, విద్య, ఆరోగ్య సదుపాయాలు, పరిరక్షణ వంటి ముఖ్యమైన పనులు చేపట్టాలని కాపు సంక్షేమ శాఖ అధ్యక్షులు చేగొండి హరి రామ జోగయ్య తెలిపారు. ఆయన గురువారం బహిరంగంగా మంత్రి నిమ్మల రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. అయితే మంత్రి నిమ్మల రామానాయుడు పాలకొల్లు నియోజకవర్గంలో అభివృద్ధి బాగానే చేస్తున్నారని కితాబు ఇచ్చారు. పాలకొల్లు నియోజకవర్గం ఆచంట, నరసాపురం, భీమవరం, రాజోలు నియోజకవర్గాలకు మధ్యగా ఉందని, ఈ నేపథ్యంలో ఇక్కడ విద్య, వైద్య సదుపాయాలు పెంచాలని కోరారు.

అశ్లీల నృత్యాల ఘటనలో 22 మంది అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిడమర్రు మండలం క్రొవ్విడిలోని అశ్లీల నృత్యాల ఘటనపై కేసు నమోదు చేసి 22 మందిని గురువారం అరెస్టు చేసినట్లు గణపవరం సిఐ సుభాష్ తెలిపారు. ఈ నెల 12వ తేదీన క్రొవ్విడి జనసేన గ్రామాధ్యక్షుడు వాకమూడి ఇంద్రకుమార్ తన పుట్టినరోజు పేరుతో స్థానిక రైస్‌మిల్లులో పార్టీ చేసుకున్నారు. ఈ సందర్భంగా భీమవరం నుంచి ఇద్దరు హిజ్రాలను తీసుకొచ్చి నగ్నంగా నృత్యాలు చేయించిన వీడియోలు బుధవారం వెలుగులోకి వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే చర్యలకు దిగారు. మొత్తం ఆ ఘటనలో పాల్గొన్న 20 మందికిపైన, ఇద్దరు హిజ్రాలపైనా కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఇప్పటికే ఈ ఘటనపై స్పందించిన జనసేన నాయకత్వం ఇంద్రకుమార్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. గత ప్రభుత్వ హాయాంలో పెదపాడు, పాలకోడేరు మండలాల్లో ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు స్థానిక పోలీస్ అధికారులపైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు ఈ ఘటనలో పోలీస్ అధికారులపై ఏమైనా చర్యలు తీసుకుంటారా అనే చర్చ సర్వత్రా సాగుతోంది.

అధికారులు జవాబుదారీగా ఉండాలి: కలెక్టర్

ప్రజాశక్తి - ఉండి

అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం పాందువ్వలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. ఈ సదస్సుల ముఖ్యోద్దేశ్యాన్ని ప్రజలకు తెలియజేసి వారి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, భూ సమస్యలు, రిజిస్ట్రేషన్ సమస్యలు వంటి వాటి పరిష్కారానికి అర్జీలు సమర్పించాలన్నారు.



వీరవాసరం : మాట్లాడుతున్న తహశీల్దార్

వీరవాసరం: రీసర్వేలో వచ్చే భూమి వాస్తవ విస్తీర్ణంలో వచ్చే వ్యత్యాసాలను భూ యజమానులు అంగీకరించాల్సిందేనని తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు అన్నారు. వీరవాసరం పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వందేళ్ల క్రితం జరిగిన భూ సర్వే డిగ్లయల్ ఆఫ్‌సెట్ (డిఒ) పద్ధతిలో జరిగిందన్నారు. ఈ పద్ధతిలో వందశాతం నికరమైన కొలతలు జరగలేదన్నారు. అందువల్ల దస్త్రాలలో రాసినట్లు ఉన్న ఎకరం భూమి దాని విస్తీర్ణంలో ఐదు సెంట్లు తక్కువ వచ్చినా ఆ తప్పును భూ యజమానులు అంగీకరించాలని తెలిపారు. ప్రస్తుతం రీ సర్వే భూమి అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా శాటిలైట్, రోవర్‌తో అనుసంధానంతో జరుగుతుందన్నారు. ఈ సర్వేలో దాదాపు వంద శాతం కొలతలు నికరంగా ఉంటాయన్నారు. అందువల్ల భూ యజమానులు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని తెలిపారు. రైతులు ఏర్పాటు చేసుకున్న భూమి గట్లను హద్దులుగా ఆధారం చేసుకుని సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో వారి భూమి హెచ్చు తగ్గులు ఉంటే హద్దుదారులిద్దరూ అంగీకారంతో వస్తే నిర్ణీత సమయంలో అధికారులుగా సరిచేస్తామన్నారు. ప్రభుత్వ భూములను సంరక్షించుకోవడం తమ బాధ్యతని ప్రయివేటు భూములను ఎవరికి వారే సంరక్షించుకోవాలని సూచించారు. ఈ సదస్సులో 73 మంది భూ యజమానులు తమ సమస్యపై దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచి చికిలే మంగతాయారు, విధానాలు నీటి సంఘం అధ్యక్షులు గవిరెడ్డి చిన్నారావు, రెవెన్యూ అధికారులు, భూ యజమానులు పాల్గొన్నారు.

నరసాపురం : ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే ఆ కుటుంబాలకు దారి లేదు, ఉన్న ఒక్కదారిని మూసేశారు. దారి ఇవ్వమంటే ఇవ్వడం లేదు, కనీసం మీరైనా ఆ కుటుంబాలకు నడిచేందుకు దారి చూపించాలంటూ గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో మాజీ ఎఎంసి ఉపాధ్యక్షులు వైఎస్ బాబులు తహశీల్దార్ రాజారాజేశ్వరికి విన్నవించారు. వైఎస్ పాలెం సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మేడిద మేకల చెందిన నాలుగు కుటుంబాలు జీవిస్తున్నాయి. తన భూమిలోంచి నడిచేందుకు వీల్లేదని దారి అడ్డంగా యాజమాని కర్రలు కట్టారు. ఇదే సమస్య గతంలో చెప్పారు. కనీసం మీరైనా ఈసమస్యకు పరిష్కారం చూపించాలి, లేని పక్షంలో ఆ కుటుంబాలు ఇబ్బందులు పడతాయని విన్నవించారు. స్పందించిన తహశీల్దార్ సర్వే చేసి దారి చూపించే విధంగా చర్యలు తీసుకోవాలని విఆర్ఒ చిరంజీవిని ఆదేశించారు. అనంతరం సదస్సులో ప్రజలు, రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వైఎస్ నాగముత్యామాంబ, ఉప సర్పంచ్ వాసు, రైతులు పాల్గొన్నారు. పెదమైనవాని లంక గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డిఒ దాసిరాజు పాల్గొన్నారు. సమస్యలను సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

మొగల్తూరు : ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కె.రాజకిషోర్ సూచించారు. మొగల్తూరు పంచాయతీ పరిధిలోని నాలుగు సచివాలయాల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 20 వినతులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ముక్కు పుల్లయ్య, ఆర్ఐ ముచ్చర్ల నిరంజన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకోడేరు : జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కోరుకొల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును పరిశీలించి ఫిర్యాదు దారుల నుంచి వినతులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి 45 రోజుల్లోగా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు.

ఆక్రమణకు గురైన పంచాయతీ స్థలం పరిశీలన

కోరుకొల్లులో పంచాయతీ స్థలం ఆక్రమించి నిర్మించిన పక్కా గృహం, ఆక్రమణకు గురైన పంచాయతీ చెరువును సంబంధిత అధికారులతో జేసి పరిశీలించారు. ఆక్రమణ సంబంధించిన వారికి నోటీసులు జారీ చేసి రిపోర్టును అందించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ ఎన్.భారతి విజయలక్ష్మి, ఎంపిడిఒ రెడ్డియ్య, మండల సర్వే శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

సయ్యద్ ఫజులుద్దీన్ సేవలు అభినందనీయం

విద్యుత్ శాఖ ఇఇ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

విద్యుత్ సంస్థలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా సయ్యద్ ఫజులుద్దీన్ 32 ఏళ్లగా ఉద్యోగ సేవలందించి అందరి మన్ననలు పొందడం అభినందనీయమని విద్యుత్ శాఖ ఇఇ ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో గురువారం సయ్యద్ ఫజులుద్దీన్ ఉద్యోగ విరమణ సభ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు జె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో రోజురోజుకీ పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. ఫజులుద్దీన్ సౌమ్యునిగా, వివాదరహితునిగా సుదీర్ఘకాలం వివిధ ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పని చేయడం అభినందనీయమన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు మాట్లాడుతూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ సంస్థకు కొంత ఇబ్బందేనన్నారు. సిఐటియు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శులు డిఎన్‌విడి.ప్రసాద్, కె.రాజారామ్మోహన్‌రాయ్, అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్థలను ప్రయివేటీకరించాలనే ప్రయత్నాలను ఉద్యోగులతోపాటు ప్రజానీకం కూడా ఎదుర్కోవాలని కోరారు. ప్రభుత్వాల విధానాల వల్ల అన్ని సంస్థల్లోని ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, రాయితీలు కోల్పోతున్నారని, హక్కుల కోసం ఐక్యంగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. అసిస్టెంట్ ఇంజనీర్లు పి.పద్మశ్రీ, వి.ప్రసాదరాజు, ఎం.మాధవరాజు, డి.శ్రీనివాసరావు, సిహెచ్.వీరాస్వామి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పని చేయడం కత్తి మీద సాము వంటిదని, ప్రజలకు సేవ చేయడం మహాభాగ్యమని అన్నారు. ఆ బాధ్యతల్లో ఫజులుద్దీన్ సఫలీకృతమయ్యారని కొనియాడారు. ముస్లిం మైనార్టీస్ అధ్యక్షులు ఎస్‌కె.రబ్బానీ, మానవ హక్కుల సంఘం అధ్యక్షులు కొయ్య శ్రీనివాస్, ఫజులుద్దీన్ కుటుంబ సభ్యులు పోడూరు తహశీల్దార్ సయ్యద్ ఫాజిల్, మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగ సంఘం నాయకులు మహ్మద్ ఇబ్రహీం, ముగ్గం ఆలీ, యూనియన్ జిల్లా అధ్యక్షులు బర్రె రాము, నాయకులు కళ్యాణ్ చక్రవర్తి, తిరపతి, బోసు, జానకీరామ్, దత్తాత్రేయ తదితరులు మాట్లాడారు. తొలుత యూనియన్ జిల్లా నాయకులు ఎం.సురేష్ స్వాగతం పలికారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులు, బంధువులు స్నేహితులు, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన ఫజులుద్దీన్ దంపతులను సత్కరించారు.



ఫజులుద్దీన్ దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు, యూనియన్ నేతలు

పశువుల షెడ్ల నిర్మాణంలో అలసత్వం వహిస్తే చర్యలు : కలెక్టర్

భీమవరం : పశువుల షెడ్ల నిర్మాణాల్లో వెనుకబడిన వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణి గోకులం షెడ్ల నిర్మాణాల పురోగతి, అంగన్వాడీ పిల్లలకు ఆధార్ ఎన్రోల్మెంట్, మిస్సింగ్ హౌస్ డేటా ఎన్రోల్మెంట్, హౌస్ హెూల్డ్ జియో ట్యాగింగ్, ఎన్‌పిసిఐ నమోదు అంశాలపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో 900 పశువుల షెడ్ల నిర్మాణమే లక్ష్యంగా రూ.18.40 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకూ కేవలం 50 షెడ్లు మాత్రమే పూర్తి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. షెడ్ల నిర్మాణ పనుల్లో ప్రగతి సాధించని ఎపిఒ, ఇసి, టిఎలపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆధార్ ప్రత్యేక క్యాంపులను వినియోగించుకొని అంగన్వాడీ పిల్లల ఆధార్ నమోదును వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో సుమారు 25 వేలు నమోదు చేయాల్సి ఉండగా చాలా తక్కువ మొత్తంలో నమోదు కావడంపై జిల్లా కలెక్టర్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. డిసెంబరు చివరినాటికి ఎట్టి పరిస్థితుల్లో నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, జిల్లా జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు పాల్గొన్నారు.



మొగల్తూరు : విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు

దాతలు అందజేస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కార్ సూచించారు. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1985 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్వ విద్యార్థి గ్రంధి సూరిబాబు పాఠశాలపై మక్కువతో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సొంత నిధులు వెచ్చించి స్టడీ మెటీరియల్ సమకూర్చారు. గురువారం సాయంత్రం యుటిఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా వాటిని అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం దాత గ్రంధి సూరిబాబును పాఠశాల సిబ్బంది ఘనంగా అభినందించారు. కార్యక్రమాల్లో యుటిఎఫ్ నాయకులు కొల్లాటి బ్రహ్మయ్య, చింతలపూడి శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు తన్నీడి జయరాం, శివరామకృష్ణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : తరగతి గదుల్లో ఇస్తున్న స్టడీ మెటీరియల్‌తో పాటు స్వచ్ఛంద సంస్థలు ఇస్తున్న స్టడీ మెటీరియల్ కూడా పూర్తిగా అవగాహన చేసుకుంటే పదిలో విద్యార్థులు మంచి మార్కులు సాధించవచ్చని యునైటెడ్ కాపు క్లబ్ అధ్యక్షులు జక్కంపూడి మదన్ చెప్పారు. గురువారం యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్, సబిత కాలేజీ ఆధ్వర్యంలో బివిఆర్ఎం గర్ల్స్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో మద్దాల వాసు, జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్, రావాడ సతీష్, కానూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

తణుకు : పదో తరగతి విద్యార్థి దశలో కీలక మలుపని, బాగా చదివి మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణులవ్వాలని శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ పి.దక్షిణామూర్తి సూచించారు. గురువారం స్థానిక అమరవీరుల భవనంలో శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రశ్నలు, జవాబులతో కూడిన ఉచిత పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా దక్షిణామూర్తి మాట్లాడుతూ సమగ్ర సమాచారంతో కూడిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశామన్నారు. శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం నిర్వహించే ఉచిత కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్ శిక్షణ, న్యాయ సేవలను కూడా అందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం సభ్యులు శేషుబాబు, కామన మునిస్వామి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిసి హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

మంత్రి సుభాష్‌కు బిసి సంక్షేమ సంఘం నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బిసి హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవానీ యాదవ్, జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లిలో గురువారం మంత్రిని బిసి సంఘం నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. స్కూల్ నుంచి కాలేజీ వరకూ మెస్ ఛార్జీలు సరిపోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచి, హాస్టళ్లలో మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. చాలా హాస్టళ్ల అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారని, సొంత భవనాల నిర్మాణానికి దృష్టి పెట్టాలని కోరారు. బిసి సంక్షేమ అధికారులకు హాస్టల్స్ నిర్వహణ బిల్లులు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, అప్పులు చేసి హాస్టల్స్ నిర్వహిస్తున్నారని, పెండింగ్ బిల్లులు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. ప్రతి నెలా బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు నిర్ణయించి భావి భారత పౌరులుగా ఎదగాల్సిన విద్యార్థులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. దీనిపై మంత్రి సుభాష్ సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తామని చెప్పారని తెలిపారు.



మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అంజేస్తున్న నేతలు

జిల్లాను కాలుష్య కోరల నుంచి కాపాడాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

పచ్చని పశ్చిమగోదావరి జిల్లా కాలుష్య కోరల్లో చిక్కుకుందని, దానిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అన్నారు. ప్రభుత్వం కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం భీమవరంలో సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పశ్చిమగోదావరి జిల్లా అంటే పచ్చగా ఉంటుందని, కాలుష్యానికి దూరంగా ఉంటుందని, ధనిక జిల్లా అని, సంప్రదాయాలకు నిలయంగా ఉన్న జిల్లా అని చెప్పుకుంటున్నామని, ఈ కాలంలో కేన్సర్ వంటి భయంకరమైన వ్యాధులకు నిలయంగా మారిందనేది ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. గోస్తనీ, వెంకయ్య వయ్యేరు, యనమదుర్రు డ్రెయిన్ వంటివన్నీ కాలుష్య కాసారాలుగా మారిపోయాయన్నారు. దీనికి కారణం ఫ్యాక్టరీల నుంచి విడుదలవుతున్న వ్యర్థాలు, ఆక్వా చెరువుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా విడుదల చేస్తున్న కాలుష్య నీరే కారణమన్నారు. తక్షణమే కాలుష్యం నుంచి జిల్లాను రక్షించడానికి ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ శాచే. దీనిపై జనవరి 3, 4, 5 తేదీల్లో జరిగే జిల్లా మహాసభల్లో తీర్మానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కృష్ణ, త్రిమూర్తులు, పతివాడ నాగరాజు, సాంబ, కోదండం, మజ్జి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సిపిఎం నాయకుడు సాయిబాబా మృతి

ప్రజాశక్తి - యలమంచిలి

సిపిఎం నాయకుడు, మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన చింతపల్లి సాయిబాబా (60) బుధవారం రాత్రి మృతి చెందారు. కొన్ని రోజుల కిందట గడ్డి ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్రంగా గాయపడడంతో ఆయనను వారి కుటుంబ సభ్యులు ఏలూరు ఆశ్రమ ఆసుపత్రిలో వైద్యం చేయించినప్పటికీ సాయిబాబా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందారు, ఆయన భార్య సంవత్సరం కిందట అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు కుమారుడు ఉన్నారు. ఈ మేరకు సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు, పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు, సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, కెవిపిఎస్ మండల అధ్యక్షుడు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ తదితరులు సాయిబాబా మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ 1977 - 80 మధ్యకాలంలో చించినాడలో భూస్వాములకు, పేదలకు మధ్య జరిగిన మహా పోరాటంలో సాయిబాబా తండ్రి చింతపల్లి సూర్యారావు మంచి మిలిటెంట్ కార్యకర్తగా ప్రత్యర్థి వర్గానికి ఎదురొడ్డి నిలిచి పోరాటం చేస్తున్న నేపథ్యంలో అప్పటికి యుక్త వయసులో ఉన్న సాయిబాబా ఆ పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. ఆ సమయంలో సాయిబాబా రెండు కేసులు కూడా ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. పార్టీ పరంగా చేపట్టిన ప్రతి కార్యక్రమంలో కూడా సాయిబాబా ఎంతో చైతన్యంగా పాల్గొనే వారన్నారు. సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ సాయిబాబా మృతి వారి కుటుంబానికే కాకుండా పార్టీకి తీరనిలోటు అని అన్నారు. అనంతరం జరిగిన సాయిబాబా అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు, బంధువులు, సిపిఎం కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సాయిబాబా (ఫైల్‌ఫోటో)

వినియోగదారుల హక్కులపై అవగాహన

గణపవరం: గణపవరం డిగ్రీ కాలేజీలో గురువారం విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహనా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా విద్యార్థులకు ఈ నెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ వారం రోజుల పాటు విద్యార్థులకు అనేక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మదురాజు, లెక్చరర్లు సిహెచ్ చైతన్య, కె.స్వరూపరాణి, జివిఆర్ వెంకట రమణ, పి.భాస్కర్, వెంకన్నన్నబాబు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్‌ను కలిసిన పితాని

పెనుమంట్ర: వారానికి రెండు రోజులు విజయవాడ - దుబాయ్ (షార్జా) విమాన సర్వీసులు నడపాలని కేంద్ర పౌర విమాన శాఖా మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడును ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ కోరారు. గురువారం ఉదయం ఢిల్లీలోని కేంద్ర పౌర విమాన శాఖ కార్యాలయంలో రామ్మోహన్ నాయుడును కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా

భీమవరం టౌన్: ఫైవ్ స్టార్ రేటెడ్ గృహోపకరణాలు, ఎల్ఇడి బల్బులు వాడడం వల్ల కరెంటు బిల్లు చాలా తగ్గడమే కాకుండా కాలుష్యాన్ని కూడా తగ్గించవచ్చని ఎలక్ట్రికల్ డిఇ ఎన్.వెంకటేశ్వరరావు, ఎడిఇ కె.రాంబాబు, ఇంజినీర్ పద్మశ్రీ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మెప్మా మహిళలతో సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యుత్తు పొదుపునకు సోలార్ ఎంతో మంచిదన్నారు. ఎలక్ట్రిసిటీ వాడకాన్ని తగ్గించాలని, ఎల్ఇడి బల్బులు వాడితే 60 శాతానికిపైగా విద్యుత్ ఆదా చేయొచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ అవసరం లేని సమయంలో స్విచ్ ఆఫ్ చేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, సిటీ మిషన్ మేనేజర్ కె.సుధాకర్‌రావు, సిఒ జయకృష్ణ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్లలో మున్సిపల్ కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానిక బుధవారం మార్కెట్, పాత బస్టాండ్, అడ్డ వంతెన వద్ద ఉన్న అన్నా క్యాంటీన్లను కమిషనర్ కె.రామచంద్రారెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న అన్నా క్యాంటీన్ భోజన పథకం సరిగ్గా అమలయ్యేలా చూసుకోవాలని మున్సిపల్ అధికారులకు, క్యాంటీన్ సూపర్‌వైజర్లకు తగు సూచనలు జారీచేశారు. అలాగే సంబంధిత వర్కర్లు డ్రెస్ కోడ్‌లో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ వై.హరిహరనాథ్ సూచించారు. పట్టణంలోని హౌసింగ్ కాలనీ ప్రాంతాలను ఆయన గురువారం సాయంత్రం పరిశీలించారు. మధ్యలో ఆగిన నిర్మాణాలను పరిశీలించి కమ్యూనిటీ సెక్రటరీలతో స్టేజిల్ వారి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి బిల్లులు గానీ, మెటీరియల్ గానీ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని, లబ్ధిదారులను సమన్వయ పర్చి నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వెంకటరమణ, డివిజనల్ ఇంజినీర్ కెవిఎస్.ప్రసాద్, అసిస్టెంట్ ఇంజినీర్ వైవి.వెంకట్రావు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే విక్రయించాలి : ఎఒ

మొగల్తూరు: ఒబ్బిడి చేసుకున్న ధాన్యాన్ని రైతులు వెంటనే విక్రయించాలని ఎఒ అబ్దుల్ రహీమ్ సూచించారు. మండలంలోని గ్రామాల్లో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తేమశాతం ఉంటే ఆ ధాన్యాన్ని వెంటనే విక్రయించాలన్నారు. తేమశాతం ఎక్కువ ఉంటే వాతావరణంలో మార్పులు వచ్చేవరకూ భద్రపరచాలని సూచించారు. వాతావరణంలో మార్పులు కారణంగా రాగల రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని కోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు.